




ఆర్ట్స్‌కాలేజీ మైదానంలో మంత్రి కేటీఆర్‌ను కలవడానికి వచ్చిన మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్సీలు కడియం శ్రీహరి, బస్వరాజు సారయ్య, ఎంపీ పసునూరి దయాకర్, జడ్పీ సుధీర్‌కుమార్, చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్, డాక్టర్ శేషుమాధవ్

# మంత్రి కేటీఆర్‌కు ఘన స్వాగతం

### పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికిన ప్రముఖులు

సుబేదారి, అక్టోబర్ 6: మున్సిపల్, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ వరంగల్ నగరానికి విచ్చేసిన సందర్భంగా, హనుమకొండ సుబేదారి ఆర్ట్స్‌అండ్‌సైన్స్ కళాశాల మైదానంలో, ఇద్దరు మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, ఉమ్మడి వరంగల్‌జిల్లాకు చెందిన ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, అధికారులు ఘనస్వాగతం పలికారు. శుక్రవారం మంత్రి కేటీఆర్ హైదరాబాద్‌నుంచి హెలికాప్టర్‌లో సుబేదారి ఆర్ట్స్ అండ్ కళాశాల మైదానం కు ఉదయం 10:40 చేరుకున్నారు. హెలిపాడ్ వద్ద మంత్రి కేటీఆర్‌కు పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి సత్యవతిరాథోడ్, ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్, మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, ఎమ్మెల్సీలు కడియం శ్రీహరి, బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు చల్లా ధర్మారెడ్డి, అరూరి రమేశ్, నన్నపునేని నరేందర్, రైతు రుణ విమోచన కార్పొరేషన్ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు, నగరమేయర్ గుండు సుధారాణి, పోలీసు కమిషనర్ ఏవీ రంగనాథ్, కలెక్టర్ సిక్తాపట్నాయక్, జాయింట్ కలెక్టర్ మహేందర్‌జీ పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.




మంత్రి కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలుకుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్, సీపీ ఏవీ రంగనాథ్






మంత్రి కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలుకుతున్న మున్సిపల్ కమిషనర్ రిజ్వానా బాషా, ట్రైనీ కలెక్టర్ శుక్లా, కుడా చైర్మన్ సుందర్‌రాజ్‌యాదవ్, ట్రైనీ కలెక్టర్

# సర్కారు బడులకు విద్యార్థుల క్యూ

- ఇకపై పాఠశాలల్లో రోజుకో రకమైన అల్పాహారం..
- పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- బ్రేక్‌ఫాస్ట్ కోసం ఏటా రూ.400 కోట్లు..
- గిరిజన, శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్
- అల్పాహారం ద్వారా చిన్నారుల ఆరోగ్యం పదిలం..
- ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్ భాస్కర్
- లష్కర్‌బజార్ ప్రభుత్వ ప్రాక్టీసింగ్ పాఠశాలలో 'సీఎం బ్రేక్‌ఫాస్ట్ స్కీం' ప్రారంభం




విద్యార్థులకు అల్పాహారం వడ్డిస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్

హనుమకొండ సిటీ, అక్టోబర్ 6 : సర్కారు బడుల్లో అందిస్తున్న నాణ్యమైన విద్య, పౌష్టికాహారానికి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆకర్షితులవుతూ సర్కారు బడులల్లో చేరేందుకు క్యూ కడుతున్న రాష్ట్రం దేశంలో తెలంగాణ ఒక్కటేనని పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. పౌష్టికాహార లోపాన్ని నిర్మూలించడానికి ప్రభుత్వం కొత్తగా శ్రీకారం చుట్టిన సీఎం బ్రేక్ ఫాస్ట్ స్కీంను శుక్రవారం హనుమకొండ లష్కర్‌బజార్‌లోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ ప్రైమరీ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో గిరిజన, శిశుసంక్షేమ శాఖ మంత్రి సత్యవతిరాథోడ్, ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్, మంత్రి దయాకర్‌రావులు కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి దయాకర్‌రావు మాట్లాడుతూ స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ రాష్ట్రంలోని నిరుపేద విద్యార్థులకు సైతం ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ విద్య అందించేందుకు గత సంవత్సరం రూ.10వేల కోట్లతో పాఠశాలలను ఆధునీకరించారన్నారు. పుస్తకాలు, యూనిఫామ్స్, సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం అందజేస్తున్నట్లు తెలిపారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు సంఖ్య సైతం పెరిగిందన్నారు. అంతేకాకుండా సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని అమలు చేసి రోజుకో తీరు టిఫిన్ అందించడానికి ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందన్నారు. ప్రతి పేద విద్యార్థి కూలీనాలికి పోకుండా సర్కారుబడికి పోయి చదువుకుంటున్నది ఒక్క తెలంగాణలోనే అని చెప్పారు. మండలాల్లో రెసిడెన్షియల్ పాఠశాలలు, నియోజకవర్గాల్లో డిగ్రీ కళాశాలలు స్థాపించి ఒక్కో విద్యార్థిపై లక్ష 25 వేల రూపాయలను ప్రతి యేడా ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. గిరిజన, శిక్ష సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 20లక్షల పైగా ఉన్న విద్యార్థులకు అల్పాహారం కోసం ప్రభుత్వం ఏటా రూ.400 కోట్లు ఖర్చు పెట్టనుందన్నారు. సెమిరెసిడెన్షియల్ తరహాలో కూలీనాలీ చేసుకొనే తల్లిదండ్రులకు ఎలాంటి ఆందోళన లేకుండా ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌ను అందించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందన్నారు. తద్వారా విద్యార్థులు చదువుపై శ్రద్ధపెట్టి, ఆరోగ్యవంతంగా తయారవుతారన్నారు. ప్రభుత్వ చీఫ్ విప్ వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ రాజ్యాంగంలోని రెండు ప్రాథమిక హక్కులైన విద్య, వైద్యంను గత ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తే సీఎం కేసీఆర్ ప్రత్యేక దృష్టి సారించి ఈ రెండు రంగాలను అభివృద్ధి పథంలో తీసుకెళ్తున్నారన్నారు. మన ఊరు–మన బడి కార్యక్రమం ద్వారా మౌలిక వసతుల కల్పించి, ఇప్పుడు అల్పాహారానికి శ్రీకారం చుట్టడంతో పిల్లలు వారి తల్లిదండ్రులు సంతోషపడుతున్నారన్నారు. పిల్లల ఆరోగ్యానికి అల్పాహార పథకం దోహదపడనుంద న్నారు. దేశ ప్రజలంతా కేసీఆర్ నాయకత్వం కావాలని కోరుకుంటున్నారన్నారు. రాష్ట్రంలో మూడోసారి కేసీఆర్ సీఎంగా బాధ్యతలు స్వీకరించండంతోపాటు కేంద్రంలో బీఆర్ఎస్ కీలక పాత్ర పోషించబోతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ సుధీర్‌కుమార్, జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, పాఠశాల ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి, మండల విద్యాశాఖధికారి రాంకిషన్‌రాజు, సెక్టోరియల్ అధికారులు రాధా, సునిత, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ నుంచి బీఆర్ఎస్‌లోకి..

### మంత్రి కేటీఆర్ సమక్షంలో పార్టీలో చేరిన ఈగ మల్లేశం

హనుమకొండ, అక్టోబర్ 6 : బీజేపీ రాష్ట్ర నాయకుడు ఈగ మల్లేశం బీజేపీని వీడి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. శుక్రవారం హనుమకొండ, వరంగల్ పర్యటనకు వచ్చిన రాష్ట్ర మున్సిపల్, ఐటీశాఖ మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీ కండువా కప్పుకున్నారు. ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ ఆధ్వర్యంలో చేరిన ఈగ మల్లేశంకు మంత్రి కేటీఆర్ బీఆర్ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సుదీర్ఘ రాజకీయ ప్రస్తానం ఉన్న మల్లేశం తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నారు. తెలంగాణలో సీఎం కేసీఆర్ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలతోపాటు, బీఆర్ఎస్ పార్టీకి ప్రజల నుంచి వస్తున్న ఆదరణను చూసి పార్టీలో చేరుతున్నట్లు మల్లేశం తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి పనిచేస్తానని అన్నారు.



ఈగ మల్లేశంకు కండువా కప్పి బీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి కేటీఆర్

## రేపు బాస్కెట్‌బాల్ సెలక్షన్స్

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 6 : హనుమకొండ డిస్ట్రిక్ట్ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 8న హనుమకొండ జిల్లా సీనియర్స్(మెన్ అండ్ ఉమెన్) బాస్కెట్‌బాల్ జట్టు ఎంపికలు ఫాతిమానగర్‌లోని సెయింట్ గాబ్రియల్స్ హైస్కూల్‌లో నిర్వహిస్తున్నట్లు హనుమకొండ జిల్లా అధ్యక్షుడు తాళ్లపల్లి రాజు, ప్రధాన కార్యదర్శి డోలి సాంబయ్య తెలిపారు. సీనియర్స్ సెలక్షన్స్ ట్రయల్స్‌లో పాల్గొనే క్రీడాకారులు ఆదివారం 4గంటలకు సెయింట్‌గాబ్రియల్స్ హైస్కూల్ బాస్కెట్‌బాల్ మైదానంలో తప్పనిసరిగా తమ ఒరిజినల్ ఆధార్‌కార్డుతో హాజరుకావాలన్నారు. సెలక్ట్ అయిన క్రీడాకారులు అక్టోబర్ 17నుంచి 19వరకు కోదాడ, సూర్యాపేట జిల్లాలో జరుగనున్న సీనియర్స్(మెన్ అండ్ ఉమెన్) బాస్కెట్‌బాల్ ఇంటర్ డిస్ట్రిక్ట్ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని, 83284 49263 నంబర్‌లో ఎండీ ఇర్ఫాన్‌ను సంప్రదించాలని కోరారు.